జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 79 30-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# కార్యకర్తలను దూరం పెట్టే నేతలు మాకొద్దు



- కష్టపడేవారిని గుర్తించే బాధ్యత లోకేశ్‌దే
- అమరావతి దేవతల రాజధాని.. అది కొందరు రాక్షసులకు ఇష్టం లేదు
- ఇక మూడు ముక్కలాటకు తావులేదు
- ఆర్థికంగా ఇబ్బందులున్నా, కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నాం
- చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలి
- ప్రతి ఎన్నికల్లో కూటమి గెలవాలి

అమరావతి,: పార్టీ కోసం పని చేసే వాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను దూరం పెట్టే నేతలను తానూ దూరం పెడతానన్నారు. కార్యకర్తలను పట్టించుకోని నేతలు తనకు అవసరం లేదని తేల్చిచెప్పారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేశ్‌దేనని చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. వ్యక్తిగత ప్రవర్తన మొదలుకొని ప్రతి అంశంలో టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మమేకం కావాలని.. సమస్యలు పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల వల్లే మనం ఇక్కడ ఉన్నామని గుర్తుపెట్టుకోవాలి. పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలు, మంత్రులైన వాళ్లు దీనిని బాగా అర్థం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు, విధానాలకు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో

మిగతా 2లో



# కన్నవారిని నిర్లక్ష్యం చేసే కొడుకులను బహిష్కరించాలి

## తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

- తల్లిదండ్రుల పట్ల భక్తి లేనివారికి భయం కలిగించేందుకే ఈ చట్టం
- ఫిర్యాదులపై చర్యలకు చట్టపరిధిలో ప్రత్యేక యంత్రాంగం
- వృద్ధుల గౌరవ జీవనానికి ఈ చట్టం ఒక మార్గం: మంత్రి అడ్లూరి
- క్రీడల్లో రాణించినా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా: రేవంత్

2లో




## పొంగులేటి రాజీనామా చేయడం కాదు.. సభకు రాని కేసీఆర్‌తో చేయించండి

- వారి మంత్రివర్గంలో నలుగురూ రావులే
- మా ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు
- హరీశ్ తమ్ముడు, బావమరిది బాలానగర్ భూదందాపై హౌస్ కమిటీ వేద్దామా?
- ఎథిక్స్ కమిటీని నియమించి కౌశిక్‌రెడ్డి తీరుపై నిర్ణయం తీసుకోవాలి: సీఎం రేవంత్

# పశ్చిమాసియాకు ఖాళీ ట్యాంకర్లు!

## చమురు, గ్యాస్ కోసం పంపిస్తున్న భారత్

న్యూఢిల్లీ, మార్చి 29: హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ప్రస్తుతం 20 వరకు భారత చమురు, గ్యాస్ నౌకలు సముద్రంలో నిలిచిపోయాయి. మరోపక్క ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య తీవ్ర స్థాయిలో డ్రోన్లు,క్షిపణుల యుద్ధం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో చమురు, గ్యాస్ రీఫిల్ కోసం భారత్ పశ్చిమాసియాకు




మిగతా 2లో




# కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

## టీడీపీ శ్రేణులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పార్టీ శ్రేణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ఐక్యత అత్యంత కీలకమని, ఈ స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. దివంగత నందమూరి తారక రామారావు 'తెలుగువారి ఆత్మ గౌరవం' అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక సంచలనం సృష్టించిందని


మిగతా 2లో




## క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి

- నేటి నుంచి యూఎస్ వీసా నిబంధనలు మరింత కఠినం
- అమెరికా నేవీ అధికారుల ఫొటోలు విడుదల

## తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం



2లో



2లో

## ప్రజలంతా ఐక్యంగా ఉండాలి

- నేటి నుంచి యూఎస్ వీసా నిబంధనలు మరింత కఠినం
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ

## కేసీఆర్ అసెంబ్లీకి రానిది దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే..

హైదరాబాద్, పతిపక్ష నేత కేసీఆర్‌కు దళితులంటే చిన్నచూపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ స్పీకర్‌గా దళితుడు ఉన్నందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదని ఆరోపించారు. దళిత స్పీకర్ పైన కూర్చుంటే.. దొరబిడ్డనైన తాను కింద కూర్చోవడం ఏమిటని, ఎదుట నిలబడి మాట్లాడేందుకు మైక్ ఇవ్వమని అడగాలా? అని కేసీఆర్ భావిస్తున్నారని తెలిపారు. దళిత స్పీకర్ సభను సమర్థంగా నడపలేరని చెప్పేందుకు రాజకీయ కుట్రలో భాగంగా బీఆర్ఎస్ సభ్యులు నిరసన చేపట్టారని ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీశ్ కలిసి అసెంబ్లీ సజావుగా నడవకుండా చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా ఆదివారం శాసనసభలో సీఎం మాట్లాడారు. తెలంగాణ సాధిస్తే.. దళితుడిని తొలి ముఖ్యమంత్రిగా చేస్తానని కేసీఆర్ చెప్పారని, దీంతో జి.వివేక్, కడియం శ్రీహరి, విజయ రామారావు, ఎవరో ఒకరు సీఎం అవుతారని భావించామని అన్నారు. వికారాబాద్‌కు చెందిన చంద్రశేఖర్‌ను సీఎంను చేస్తానని నమ్మించారని చెప్పారు. కానీ, రాష్ట్రం ఏర్పడ్డాక.. దళితులకు పరిపాలన చేతకాదని, తెలంగాణలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాలంటే దొర మాత్రమే ముఖ్యమంత్రి కావాలని కేసీఆర్ అన్నారని తెలిపారు. దళితుడు సీఎం కావడానికి వీల్లేదంటూ అత్యంత అవమానకరంగా నట్టేట ముంచారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనూ దళిత వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని విమర్శించారు. దళిత వర్గానికి చెందిన భట్టివిక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఉంటే కేసీఆర్ ఓర్వలేకపోయారని సీఎం రేవంత్ అన్నారు. వివక్ష ప్రదర్శించి కాంగ్రెస్‌కు చెందిన 15 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని తెలిపారు. తద్వారా భట్టిని ప్రతిపక్ష నేతగా తొలగించి పైశాచికానందం పొందారని మండిపడ్డారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, సభలోకి రానివ్వకపోయినా ఎదుర్కొని.. భట్టివిక్రమార్క పాదయాత్ర చేపట్టి ప్రజా జీవితంలో రాణించారని చెప్పారు.

## కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో బలంగా నిలబడటం వెనుక గొప్ప పోరాట చరిత్ర ఉందని అన్నారు. పార్టీ ప్రస్థానంలో ఎదురైన ఎన్నో క్లిష్ట పరిస్థితులను, ఒడిదుడుకులను చంద్రబాబు తన అపారమైన రాజకీయ అనుభవంతో అధిగమించారని కొనియాడారు. ఆయన నాయకత్వ పటిమ పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపిందని ప్రశంసించారు. రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే అజెండాగా చంద్రబాబు పార్టీని ముందుకు నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమని పవన్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలోనూ, ప్రజా సమస్యలపై పోరాడటంలోనూ చంద్రబాబు తనదైన ముద్ర వేశారని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కూటమి ఐక్యతతోనే సాధ్యమని స్పష్టం చేసిన పవన్ కల్యాణ్, ఈ ఐక్యతను, స్నేహబంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటూ ముందుకు సాగుదామని తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

## పశ్చిమాసియాకు ఖాళీ ట్యాంకర్లు!

ఖాళీ ట్యాంకర్లు పంపుతుండడం గమనార్హం. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోపాటు సౌదీ యువరాజు మహ్మద్ సల్మాన్, కువైత్, ఖతార్, ఒమాన్ దేశాధినేతలతో ప్రధాని మోదీ నిరంతరం చర్చలు జరుపుతూ.. భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా సజావుగా సాగేలా సహకరించాలని కోరుతున్నారు. ఇప్పటికి 4ఎల్‌పీజీ, 2 చమురు నౌకలు విజయవంతంగా హోర్ముజ్ దాటాయి. వీటిలో ఐదు భారత రేవులకు చేరుకున్నాయి. మరొకటి 'పైన్ గ్యాస్' 47 వేల టన్నుల ఎల్‌పీజీతో భారత సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. ఏప్రిల్ 2నాటికి ఒడిసాలోని ధామ్రా పోర్టుకు చేరుకోనుంది. ఇంకో ఐదు చమురు నౌకలకు హోర్ముజ్ గుండా క్లియరెన్సు ఇవ్వాలని ఇరాన్ నాయకత్వంతో భారత్ సంప్రదింపులు జరుపుతోంది. వీటిలో ఎల్‌పీజీ లోడ్లు ఉన్న జగ్ విక్రమ్, గ్రీన్ ఆషా, గ్రీన్ శాన్వి.. రస్ అల్ ఖైమా(యూఏఈ)లోని మీనా సఖ్ రేవులో లంగరు వేసి ఉన్నాయి.

## తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం

తిరుమల శ్రీవారి దర్శనానికి నిన్న భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం (మార్చి 28) ఒక్కరోజే 82,040 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.18 కోట్లుగా నమోదైంది. అలాగే, 31,606 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 26 కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతుందని అంచనా.

## క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి

న్యూఢిల్లీ, మార్చి 29: మినాబ్‌లోని పాఠశాలపై క్షిపణులతో దాడి జరిపి దాదాపు 175 మంది మృతిచెందడానికి ఇద్దరు అమెరికా నేవీ అధికారులే బాధ్యులని ఇరాన్ బహిరంగంగా ఆరోపించింది. అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ స్ప్రుయాన్స్ కమాండింగ్ ఆఫీసర్ లీ ఆర్ టేట్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెఫ్రీ ఈ యార్క్ ఫొటోలను భారత్, దక్షిణాఫ్రికా, నైజీరియాల్లోని ఇరాన్ రాయబార కార్యాలయాలు 'ఎక్స్'లో విడుదల చేశాయి. "ఈ ఇద్దరు క్రిమినల్స్‌ను గుర్తుంచుకోండి. మినాబ్‌లోని బాలికల పాఠశాలపై తొమహాక్ క్షిపణిని మూడుసార్లు ప్రయోగించడానికి వీరు అనుమతి ఇచ్చారు. అభం శుభం తెలియని 168మంది చిన్నారులు మరణించడానికి కారకులయ్యారు" అని అధికారులు ఆరోపించారు. తమ చర్యలను వీరు ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు.

## పొంగులేటి రాజీనామా చేయడం కాదు.. సభకు రాని కేసీఆర్‌తో చేయించండి

ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు దళితులంటే చిన్నచూపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ స్పీకర్‌గా దళితుడు ఉన్నందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదని ఆరోపించారు. దళిత స్పీకర్ పైన కూర్చుంటే.. దొరబిడ్డనైన తాను కింద కూర్చోవడం ఏమిటని, ఎదుట నిలబడి మాట్లాడేందుకు మైక్ ఇవ్వమని అడగాలా? అని కేసీఆర్ భావిస్తున్నారని తెలిపారు. దళిత స్పీకర్ సభను సమర్థంగా నడపలేరని చెప్పేందుకు రాజకీయ కుట్రలో భాగంగా బీఆర్ఎస్ సభ్యులు నిరసన చేపట్టారని ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీశ్ కలిసి అసెంబ్లీ సజావుగా నడవకుండా చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా ఆదివారం శాసనసభలో సీఎం మాట్లాడారు. తెలంగాణ సాధిస్తే.. దళితుడిని తొలి ముఖ్యమంత్రిగా చేస్తానని కేసీఆర్ చెప్పారని, దీంతో జి.వివేక్, కడియం శ్రీహరి, విజయ రామారావు, ఎవరో ఒకరు సీఎం అవుతారని భావించామని అన్నారు.

## కన్నవారిని నిర్లక్ష్యం చేసే కొడుకులను బహిష్కరించాలి

కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసి, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు చట్టబద్ధమైనభరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం, పర్యవేక్షణ చట్టం–2026' బిల్లును రాష్ట్ర శాసనసభ ఆదివారం ఆమోదించింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సంరక్షణపై సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. పురాణ కాలపు శ్రవణ కుమారుడి మాతృ, పితృభక్తిని గుర్తుచేసి.. ఆధునిక కాలపు పారిశ్రామిక వేత్త విజయ్‌పథ్ సింఘానియా విషాద గాథను ఉటంకించి అందరినీ ఆలోచింపజేశారు. 'చూపులేని వృద్ధ తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టుకుని భుజాలపై మోస్తూ శ్రవణకుమారుడు పుణ్యక్షేత్ర దర్శనానికి తీసుకువెళ్లాడు. ఒకరోజు సరయూ నదీ తీరంలో తల్లిదండ్రుల దప్పిక తీర్చడానికి శ్రవణుడు నదిలో నుంచి నీళ్లు తీసుకుంటుండగా.. ఏదో క్రూర మృగం అని పొరబడిన దశరథ మహారాజు శబ్దభేది బాణాన్ని ప్రయోగిస్తాడు. ఆ బాణం తగిలి శ్రవణుడు మరణించాడు. పుత్రశోకంతో ఆ వృద్ధ దంపతులు నీవు కూడా పుత్ర వియోగంతోనే మరణిస్తావు అని దశరథుడిని శపిస్తారు' అని సీఎం వివరించారు. తల్లిదండ్రులను ప్రేమించడంలో శ్రవణ కుమారుడిని ఆదర్శంగా తీసుకుంటే ఎలాంటి చట్టాలు



అవసరం లేదని అన్నారు. రూ.వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన రేమండ్స్ కంపెనీ మాజీ అధినేత, పద్మభూషణ్ అవార్డు గ్రహీత విజయ్‌పథ్ సింఘానియా విషాదాంతాన్ని కూడా గుర్తు చేశారు. 'వ్యాపారవేత్తగా విజయవంతమైన సింఘానియా చివరికి కొడుకు చేసిన ద్రోహంతో అనామకుడిగా తనువు చాలించాల్సి వచ్చింది. తన జీవితకాల కష్టార్జితాన్ని పోగుచేసి సుమారు రూ. 1,000 కోట్ల విలువైన కంపెనీని కుమారుడు గౌతమ్ సింఘానియాకు అప్పగిస్తే.. ఆస్తి చేతికి రాగానే కొడుకు తండ్రిని నిర్లక్ష్యం చేశాడు. ముంబైలోని ప్రతిష్ఠాత్మక 'జేకే హౌస్' నుంచి బయటకు వెల్లగొట్టాడు. దీంతో ఆయన ముంబైలో ఒక సాధారణ అద్దె ఇంట్లో నివసిస్తూ.. ఖర్చులకు డబ్బు కోసం కోర్టులను ఆశ్రయించాల్సిన దుర్భర స్థితికి చేరుకున్నారు.

## కార్యకర్తలను దూరం పెట్టే నేతలు మాకొద్దు

పొత్తు పెట్టుకున్నాం. రికార్డులు బద్దలు కొట్టేలా విజయం సాధించాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నాం. దేశంలో ఎవరూ ఇవ్వని స్థాయిలో సామాజిక పెన్షన్లు ఇస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. డీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు కల్పించాం. తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. ఇప్పటికే 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. చెప్పినట్లుగా ఒక్క పైసా కూడా పెంచలేదు. పైగా ట్రూ అప్ నుంచి ట్రూ డౌన్ చేశాం. ఈ ఏడాది కూడా కరెంటు చార్జీలు పెంచం. అమరావతిలో మొదట ప్రారంభించిన పనులను 2028 ఆగస్టుకు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఇక మూడు ముక్కలాట లేదు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అదే అమరావతి. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు. టీడీపీ బలంగా ఉంటేనే.. రాష్ట్రం బలంగా ఉంటుంది. పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు. పసుపు జెండా నిరంతరం ఎగరాలి. గతం.. వర్తమానం.. భవిష్యత్ టీడీపీవే. పార్టీ పుట్టుక నుంచి నేటి వరకు అన్నీ సంచలనమే తెలుగుదేశం పార్టీ అభివృద్ధి రాజకీయాలు చేస్తోంది. నాయకత్వం పెంపు కోసం నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ మనదే. కార్యకర్తలకు రాజకీయ సాధికారత కల్పిస్తాం. అన్ని పదవుల్లోనూ జనాభా దామాషా పద్ధతిలో అవకాశాలు కల్పిస్తాం. కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పిస్తాం. న్యాయబద్ధమైన సంపాదన వచ్చేలా సహకరిస్తాం. తెలుగుదేశం పార్టీ విజయాలనే కాదు సంక్షోభాలను.. సవాళ్లనూ చూసింది. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు. ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆస్తులు కోల్పోయారు. నిద్రలేని రాత్రులు గడిపారు. టీడీపీని ఫినిష్ చేస్తామని ఆలోచన చేసిన వారే ఫినిష్ అయ్యారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్ర చేపడితే దాన్ని కూడా అడ్డుకున్నారు. కార్యకర్తల అండతో అడుగు ముందుకే వేశాడు. నన్ను కూడా జైల్లో పెట్టారు. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం.. అంతా కార్యకర్తల త్యాగాలు, కష్టం వల్లే. వారి సంక్షేమం కోసం ట్రస్టు ద్వారా వేల మందికి ఉచిత విద్య అందిస్తున్నాం. పనిచేసిన వాళ్లకు గుర్తింపు ఉంటుంది. కష్టపడిన వాళ్లకు పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తాం. తోట చంద్రయ్య కొడుక్కి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణా నదిలో పార్టీ జెండాలతో పడవల ర్యాలీ నిర్వహించారు. బోటింగ్ సొసైటీ ప్రతిని?ధులు ఉండవల్లి, కరకట్ట పాత ఇసుక క్వారీ నుంచి పది భారీ ఇసుక బోట్లు, 20 మరపడవలను పార్టీ జెండాలతో అలంకరించి నదిలో 3 కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు ర్యాలీ చేశారు. పడవలపై టీడీపీ జెండాలు రెపరెపలాడాయి. కరకట్ట వెంబడి ప్రయాణించే ప్రయాణికులు, వాహన చోదకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో వీక్షిస్తూ వారిని ఉత్సాహపరిచారు. అనంతరం బోట్ల ర్యాలీ ప్రకాశం బ్యారేజి వరకు చేరుకుని తిరిగి పాత ఇసుక క్వారీ వరకు సాగింది. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు దేవినేని సదాశివరావు, కేళి వెంకటేశ్వరరావు, మానికొండ ఉదయభాస్కర్, కరుణాకర్, సుబ్బారావు, సురేష్ బాబు, వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ, గాదె బసివిరెడ్డి, నరేంద్ర, పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా గోదాసు పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలు

**రామన్నపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలను ఆదివారం రామన్నపేట పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమిరుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పృథ్వీరాజ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి పృథ్వీరాజ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం, వార్డు సభ్యులు అబ్దుల్ వాహిద్ మహమ్మద్ (అంజాద్), కొమ్ము శేఖర్, బండ లింగస్వామి, సుదర్శన్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు ఎండీ అక్రమ్, కోట సుధాకర్, ఎండీ కరీం, ఇనాయతుల్లా బేగ్, ఎండీ నిజముద్దీన్, లావణం సాయి కుమార్, మణి, ప్రవీణ్ తదితరులు పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే దోపిడీ

హైదరాబాద్, బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీని ప్రజల ముందు పెట్టేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సన్నద్ధమవుతున్నారు. గత పదేళ్లలో ధరణి, మైనింగ్ పేరుతో జరిగిన అక్రమాలు, వాటి వెనక ఉన్న వ్యక్తుల ప్రమేయాన్ని ఆధారాలతో సహా ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతున్నట్లు మంత్రి సన్నిహితుల వద్ద ప్రస్తావించారు. మౌనం బలహీనత కాదని, పస లేని ఆరోపణలతో బీఆర్ఎస్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన చెప్పినట్లు తెలిసింది. సిరిసిల్ల, సిద్దిపేటలో భూములను కొల్లగొట్టిన బీఆర్ఎస్ పెద్దల బండారం బయటపడుతుందనే కొత్వాల్‌గూడ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశాన్ని తెరమీదకు తెచ్చిన తీరును కాంగ్రెస్ ఎమ్మెల్యేల వద్ద మంత్రి ప్రస్తావించినట్లు తెలిసింది.

## ప్రజలంతా ఐక్యంగా ఉండాలి

న్యూఢిల్లీ పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచం మొత్తం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని.. భారత్‌కు కూడా ఇది సవాళ్ల సమయమేనని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో ప్రజలంగా చేయి చేయి కలిపి ఐకమత్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని రాజకీయం చేయొద్దని విపక్షాలను హెచ్చరించారు. ప్రస్తుత సమయంలో స్వార్థపూరిత రాజకీయాలకు తావులేదన్నారు. ఈ మేరకు 'మన్‌కీ బాత్' 132వ ఎపిసోడ్‌లో మోదీ స్పష్టం చేశారు. వదంతులను నమ్మవద్దని ఆయన దేశప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరాయంగా సమాచారం అందిస్తోందని.. దీనిని మాత్రమే ప్రజలు విశ్వసించాలని, దానికి అనుగుణంగానే వ్యవహరించాలని సూచించారు. గతంలో ఏర్పడిన కరోనా వంటి సంక్షోభాల సమయంలో ప్రజలు ఐక్యంగా ఉండి వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారని.. అదేవిధంగా ఇప్పుడు కూడా వ్యవహరించాలని సూచించారు. కోటి మందికిపైగా భారత పౌరులు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నారని ప్రధాని తెలిపారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో వారికి ఆయా దేశాలు అండగా ఉంటున్నాయని.. ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. గల్ఫ్ దేశాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ప్రపంచ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని మోదీ కేరళలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మండిపడ్డారు. పశ్చిమాసియా యుద్ధంపై ఆ పార్టీ ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేస్తోందని, అలాంటి ప్రకటనలు గల్ఫ్ దేశాల్లో ఉంటున్న దాదాపు కోటి మంది భారతీయులను ప్రమాదంలో పడేసే అవకాశం ఉందన్నారు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముదిగుంట గ్రామం జల సంరక్షణలో దేశానికే ఆదర్శమని మోదీ ప్రశంసించారు. "ముదిగుంటలో 400 కుటుంబాలు సామూహికంగా ఒక నిర్ణయం తీసుకున్నాయి. తమ ఇళ్లలోనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకున్నాయి. ఫలితంగా, అక్కడ భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులు తగ్గాయి. ఇది నిజమైన ప్రజా ఉద్యమం." అని మోదీ కొనియాడారు. అలాగే, దేశ యువతను బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములను చేసే 'బడ్జెట్ క్వెస్ట్' కార్యక్రమంలో తెలంగాణ యువత ప్రతిభను చాటిందని తెలిపారు. సూర్యాపేటకు చెందిన కోట్ల రఘువీర్ రెడ్డి రైతుల సంక్షేమంపై రాసిన వ్యాసం తనను ఆకట్టుకుందని ప్రశంసించారు. యువత ఆలోచనలే దేశ వికాసానికి ఇంధనమని తెలిపారు.

# టీడీపీ ప్రస్థానానికి 43 ఏళ్లు.. చౌటుప్పల్‌లో పసుపు పండుగ!





- ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ వేడుకలు
- చౌటుప్పల్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన బడుగు లక్ష్మయ్య

**చౌటుప్పల్, మార్చి 29 (తొలివెలుగు న్యూస్)** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు నాంది పలికిందని మునుగోడు నియోజకవర్గ టీడీపీ మాజీ కోఆర్డినేటర్, మండల అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1982 మార్చి 29న ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ, కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి ప్రపంచ రికార్డు సృష్టించిందని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాలకు, మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడుల కృషి వల్లే ప్రాంతీయ పార్టీ అయిన టీడీపీ జాతీయ స్థాయిలో కీలక భూమిక పోషిస్తోందని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలోనూ ప్రథమ పాత్ర పోషిస్తోందని స్పష్టం చేశారు. సాధారణ వ్యక్తులను సైతం ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టిన నీతి, నిజాయితీ గల పార్టీ ఇదని కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, మారగోని అశోక్ గౌడ్, మున్సిపల్ కమిటీ అధ్యక్షులు సుంకరి జంగయ్య గౌడ్, మండల ప్రచార కార్యదర్శి పాశం రఘుపతి, టీఎన్టీసీ అధ్యక్షులు బొంగు బాదుషా, మున్సిపల్ ఉపాధ్యక్షులు తలుపునూరి శీను గౌడ్, గోష్క పాండు, చెరుకు అశోక్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల శంకరయ్య, సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, నూనె వెంకటేశం, కందగట్ల హరికృష్ణ, సంజీవ, సీతయ్య, సిగుళ్ల ఐలయ్య, గుర్రం యాదగిరి, నరసింహ, అంతటి కిష్టయ్య, బుడుగు రామరాజు తదితరులు పాల్గొన్నారు.



# చదువుకు వయసుతో పనేంటి..!

- రాజాపేట మండలంలో ఉత్సాహంగా వయోజన విద్య పరీక్షలు
- పరీక్షలు రాసిన 754 మంది వయోజనులు
- 'ఉల్లాస్' కింద అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు



**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్)** వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉల్లాస్' (నవభారత్ సాక్షరతా కార్యక్రమం) పరీక్షలు రాజాపేట మండలంలో ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాలు, సలహాల మేరకు మండల యంత్రాంగం ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించింది. నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చే క్రమంలో వారికి బోధన అనంతరం, వారి సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఎఫ్ఎల్ఎన్ఏటీ, ఎన్ఐఓఎస్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం బొమ్మ నరహరి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 754 మంది వయోజనులు ఎంతో ఆసక్తిగా ఈ పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. వయసుతో నిమిత్తం లేకుండా చదువుకోవాలన్న వారి తపన ఆదర్శనీయమన్నారు. ఈ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఏపీఎంలతో పాటు సీసీలు, వీఏఓలు, ఇతర గ్రామ స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆయన వివరించారు.

# సోమారం కురుమ సంఘం అధ్యక్షుడిగా చిన్నం బాలరాజు

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- సభ్యుల సంక్షేమం, ఐక్యతే లక్ష్యంగా పనిచేస్తానని నూతన అధ్యక్షుడి ఉద్ఘాటన





**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం సోమారం గ్రామ కురుమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో, సభ్యుల పూర్తి ఏకాభిప్రాయంతో ముగిశాయి. గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడిగా చిన్నం బాలరాజు కురుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలోని పెద్ద కురుమ పుప్పాల పెద్దిరాజు, సెల్వోజి పుప్పాల నర్సయ్య తదితర కుల పెద్దలు, సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం వివరాలు ఇలా ఉన్నాయి.. కురుమ సంఘం ఉపాధ్యక్షుడిగా పుప్పాల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల సిద్ధులు, కార్యదర్శిగా పుప్పాల శ్రీకాంత్, కోశాధికారిగా బండ నరేశ్ బాధ్యతలు చేపట్టారు. అలాగే సంఘం గౌరవ సలహాదారుడిగా బండ లింగయ్యను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా చౌదరపల్లి సిద్ధులు, కర్రె బీరప్ప, పుప్పాల కాంత్ కుమార్, చిన్నం మహేశ్, పుప్పాల మహేశ్, పుప్పాల శివకృష్ణలు ఎన్నికైనట్లు పెద్దలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు చిన్నం బాలరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సోమారం కురుమ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కుల సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, సంఘం ద్వారా చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# రాజపేటలో హనుమాన్ విజయ యాత్రకు సర్వం సిద్ధం!



- ఆహ్వాన పత్రాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా కరపత్రాల పంపిణీ
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: నిర్వాహక బృందం

**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల కేంద్రంలో ఏప్రిల్ 2వ తేదీన వీర హనుమాన్ విజయయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ మండల ప్రఖండ బాధ్యులు వెల్లడించారు. ఈ యాత్రకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆదివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాత్ర నిర్వాహక బృందం మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ, చైతన్యమే లక్ష్యంగా ఈ వీర హనుమాన్ విజయయాత్రను తలపెట్టినట్లు తెలిపారు. ఏప్రిల్ 2న ఉదయం సరిగ్గా 9 గంటలకు రాజాపేటలోని వివేకానంద చౌరస్తా నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి గాంధీ చౌరస్తా, అంబేడ్కర్ నగర్, శివాజీ చౌరస్తా, నెహ్రూ నగర్ మీదుగా పురవీధుల్లో శోభాయమానంగా సాగి, చివరగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ముగుస్తుందని యాత్ర రూట్ మ్యాప్‌ను వివరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో హిందూ బంధువులు, రామభక్తులు, హనుమాన్ మాలధారణ స్వాములు, యువత, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయయాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షులు డాక్టర్ బోగ జ్ఞానేందర్, సట్టు నాని తదితరులు పాల్గొని.. ఉప్పల రమేష్, నంగునూరు రాజు, కూనూరు భిక్షపతి తదితరులకు యాత్ర ఆహ్వాన పత్రాలను అందజేశారు.

# రామనామ స్మరణతో పులకించిన రాజాపేట

- భక్తిశ్రద్ధలతో ఏకాదశి నగర సంకీర్తన
- సామూహికంగా భావానంద అష్టకం పఠనం
- విశేష పూజల్లో పాల్గొన్న భక్తజనం

**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజాపేట మండల కేంద్రం ఆదివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పవిత్రమైన ఈ రోజున ఉదయం మండల కేంద్రంలో నగర సంకీర్తనను అత్యంత భక్తిశ్రద్ధల నడుమ కనులపండువగా నిర్వహించారు. మర్కూక్ శ్రీ భావానంద స్వామి వారి దివ్య ఆశీస్సులతో, అదరాసుపల్లి శ్రీధరశర్మ పర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం సాగింది. స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ, రాజపేట శాఖ అధ్యక్షులు నంగునూరు రాజుల ఆధ్వర్యంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద ప్రారంభమైన నగర సంకీర్తన.. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ప్రశాంతంగా కొనసాగింది. దారిపొడవునా భక్తులు చేసిన "హరే రామ.. హరే కృష్ణ" నామ జపంతో పరిసరాలు మారుమోగాయి. భక్తులు భజనలు చేసుకుంటూ పుట్ట హనుమాన్ ఆలయంతో పాటు స్థానికంగా ఉన్న పలు పురాతన దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. నగర సంకీర్తన అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో కొలువైన దేవతా మూర్తులకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి మంగళహారతి పలికారు. భక్తులందరూ ఆలయంలో సామూహికంగా కూర్చుని 'భావానంద అష్టకం' పఠించడం విశేషం. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో నంగునూరు జగదాంబ, రేపాక భాగ్యలక్ష్మి, పెంట రజిత, బోగ లత, పరమేశ్వరి, చామకూర అరుణ, నాళ్ల శేఖర్, నంగునూరు రాజు, డాక్టర్ బోగ జ్ఞానేందర్, సట్టు నాని, ఉప్పల రమేష్ తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# తెలుగు జాతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం


- ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు
- యాదగిరిగుట్టలో పార్టీ జెండా ఆవిష్కరించిన రేగు బాలనరసయ్య

**యాదగిరిగుట్ట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** తెలుగు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసిన ఘనత ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిదేనని ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి రేగు బాలనరసయ్య కొనియాడారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం యాదగిరిగుట్ట మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాలనరసయ్య మాట్లాడుతూ.. పేదల పెన్నిధి నందమూరి తారక రామారావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఆనాడు ఆయన ప్రవేశపెట్టిన రూ. 2కే కిలో బియ్యం పథకం పేదల ఆకలి తీర్చిందని స్మరించుకున్నారు. అదే బాటలో చంద్రబాబు నాయుడు విజన్ 2020తో హైటెక్ సిటీని నిర్మించి, ఐటీ రంగంలో తెలుగు రాష్ట్రాలను ప్రపంచ పటంలో నిలిపారని ప్రశంసించారు. తెలుగు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే ఏకైక పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చ నరసింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం యాదవ్, నాయకులు కిష్టయ్య, కృష్ణ, రాజకుమార్ గౌడ్, యాదగిరి, నాగరాజు, రాజు చారి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు 'ఇంజ నర్సయ్య ఫౌండేషన్' బాసట

- మరణించిన ముగ్గురు బాధితుల కుటుంబాలకు ఆర్థిక సాయం
- ఎమ్మెల్యే ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందిస్తామన్న ఇంజ నరేష్

**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే పరమావధిగా ఇంజ నర్సయ్య ఫౌండేషన్ తన ఉదారతను చాటుకుంది. రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన వట్టిపల్లి రాములమ్మ, గుండేటి సుభద్ర, బిల్ల లావణ్యలు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, ఫౌండేషన్ చైర్మన్ ఇంజ నరేష్ ఆయా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఫౌండేషన్ తరపున వారికి తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు అండగా ఉండటం తమ బాధ్యతని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి ఈ కుటుంబాల దీనస్థితిని తీసుకెళ్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యం సహా ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, పద్మశాలి, కురుమ, రజక సంఘాల నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం

**- హాజరైన కౌన్సిలర్ రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నేత నరసింహ గౌడ్**

**- పేదల సొంతింటి కల సాకారం కావడమే ప్రభుత్వ లక్ష్యం**

**చౌటుప్పల్, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. వార్డుకు చెందిన సుర్వి భావన - పులి రాజు గౌడ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి స్థానిక కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని నిరుపేదలకు గృహ వసతి కల్పించడమే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలవుతోందన్నారు. ఈ పథకం ద్వారా ఎందరో పేదలు తమ సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారని కొనియాడారు. లబ్ధిదారులైన భావన-రాజు గౌడ్ దంపతులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి శ్రీశైలం, నాయకులు సుక్క నరసింహ, సుర్వి మహేష్ గౌడ్, బొంగు గణేష్ గౌడ్, జగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల సంతాన నియంత్రణకు కేంద్రం ఏర్పాటు చేయాలి

**- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు సామాజిక చైతన్య వేదిక వినతి**

**- అదుపు తప్పుతున్న వానరాల సంఖ్య.. అల్లాడుతున్న రైతాంగం**

**రాజపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** జిల్లాలో అదుపులేకుండా పెరుగుతున్న కోతుల సంఖ్యను అరికట్టేందుకు తక్షణమే 'స్టెరిలైజేషన్ సెంటర్' (సంతాన నియంత్రణ దవాఖాన) ఏర్పాటు చేయాలని సామాజిక చైతన్య వేదిక ప్రతినిధులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కోరారు. ఆదివారం రాజపేటలో మార్త కవిత వెంకటేశం, జయశ్రీ జగదీష్ నేతృత్వంలోని బృందం ఆలేరు నియోజకవర్గ ప్రజలు, రైతుల పక్షాన ఒక లేఖను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానరాల స్వైర విహారం వల్ల ఆహార, ఆర్థిక ప్రగతి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి కంటే కోతుల బెడద నుంచే విముక్తి కావాలని అభ్యర్థులను కోరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. సర్పంచులు లక్షల రూపాయలు వెచ్చించి కోతులను దూర ప్రాంతాలకు తరలిస్తున్నా, అది తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో శాశ్వత ప్రాతిపదికన సంతాన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రజల మనిషిగా పేరున్న బీర్ల ఐలయ్యకు ఈ సామాజిక సమస్యపై లేఖను అందజేయనున్నట్లు వారు తెలిపారు.

# యాదాద్రీశుడి చెంతకు భక్తజనం.. కిటకిటలాడిన క్యూలైన్లు!





**- స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం**

**- ఏకాదశి పర్వదినం సందర్భంగా పెరిగిన రద్దీ**

**- 30 వేల మందికి పైగా స్వామివారి దర్శనం**

**యాదగిరిగుట్ట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినానికి తోడు ఏకాదశి పర్వదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే విష్ణు పుష్కరిణి వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, అనంతరం కొండపైకి చేరుకుని క్యూలైన్లలో వేచి ఉన్నారు. గర్భాలయం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. రద్దీ దృష్ట్యా ధర్మదర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కొండ కింద ఉన్న తులసి కాటేజీతో పాటు ఇతర వసతి గదులన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ప్రాంగణంలో ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. స్వామివారి నిత్యకల్యాణం, సుదర్శన నారసింహ హోమంతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.



# రామన్నపేట నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలి




**- అభివృద్ధికి ఆమడదూరంలో వెనకబడిన ప్రాంతం**

**- అన్ని వర్గాలు కలిసి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ పిలుపు**

**రామన్నపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** గతంలో నియోజకవర్గ కేంద్రంగా వెలుగొందిన రామన్నపేటను తిరిగి అసెంబ్లీ నియోజకవర్గంగా పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ హోదా కోల్పోయిన నాటి నుండి రామన్నపేట ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మండల కేంద్రంగా పరిమితం కావడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, జంపాల అండాలు, మండల కమిటీ సభ్యులు గన్నేబోయిన విజయభాస్కర్, గొరిగే సోములు, నాగాటి ఉపేందర్, వేముల సైదులు, ఆవనిగంటి నగేష్, మేడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీపై సర్కారు మౌనం వీడాలి!

**- ప్రైవేటు విద్యాసంస్థలకు డీఈఓ కొమ్ముకాస్తున్నారు: ఎస్ఎఫ్ఐ**

**- 9,500 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

**రామన్నపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** "ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది.. సామాన్య తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు.. ప్రభుత్వం మాత్రం చట్టం తీసుకురావడంలో జాప్యం చేస్తోంది" అని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మెడబోయిన మమత ధ్వజమెత్తారు. ఆదివారం రామన్నపేటలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో పర్మిషన్ లేని పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కొమ్ముకాస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రజాప్రతినిధులే ప్రైవేటు పాఠశాలల ప్రారంభోత్సవాలకు వెళ్లడం ఏంటని ఆమె ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఫీజుల నియంత్రణ చట్టంపై తీర్మానం చేయాలని పట్టుబట్టారు. గురుకులాలకు




సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఆరు నెలలుగా మెస్ ఛార్జీలు రాక హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పల్లవి మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వేముల నాగరాజు, రాజు, ఉదయ్, జగన్ నాయక్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**- టీజేఏ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ శానూర్ బాబా డిమాండ్**

**- బడ్జెట్‌లో సంక్షేమ నిధులు కేటాయించకపోవడంపై విస్మయం**

**యాదాద్రి భువనగిరి, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ శానూర్ బాబా కోరారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్‌లో నిర్వహించిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హెల్త్ కార్డులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం



కల్పించాలన్నారు. జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, గౌరవ అధ్యక్షులు మత్యాస్, కార్యదర్శులు శ్రీను, సత్యం, వలి పాల్గొన్నారు.

# తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం ఖాయం!

**- కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే రాజకీయ విద్యాలయం టీడీపీ**

**- రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ ఉద్ఘాటన**

**- 44వ వసంతంలోకి అడుగుపెట్టిన పసుపు దళం**

**- రామన్నపేటలో అట్టహాసంగా ఆవిర్భావ సంబరాలు**

**రామన్నపేట, మార్చి 29 (తొలివెలుగు న్యూస్):** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడమే లక్ష్యంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. సాధారణ కార్యకర్తలను సైతం జాతీయ స్థాయి నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. విజనరీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం గర్వకారణమని, భవిష్యత్తులో తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామన్నపేట మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నకిరేకంటి గణేష్, మండల ఉపాధ్యక్షుడు బత్తుల సత్యం, నాయకులు గాదజానీ, గంజి వీరయ్య, కొంపెల్లి వీరేశం, నరసింహ, మోటే రాజు, గొప్పల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# పులిగిల్లలో మానవత్వం.. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**- మృతుడి కుటుంబానికి రూ. 22 వేల ఆర్థిక సాయం అందజేత**

**- ముగ్గురు ఆడపిల్లల దీనస్థితిపై గ్రామస్థుల ఆవేదన**

**వలిగొండ, మార్చి 28 (తొలివెలుగు న్యూస్):** లిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పల్లెర్ల నరసింహ (45), అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉన్న ఆ నిరుపేద కుటుంబానికి ముగ్గురు చిన్నవయసున్న కుమార్తెలు ఉండటంతో గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆదివారం గ్రామ ప్రముఖులు ముందుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ వేముల అనుష తన వంతుగా రూ. 2,000 అందజేయగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్కల మాధవరెడ్డి రూ. 10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా స్థానిక సీతారామచంద్ర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు రూ. 10,000 సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తండ్రిని కోల్పోయిన ఆ చిన్నారి ఆడపిల్లలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేముల అనూష, జక్కా దామోదర్ రెడ్డి, వాకిటి సంజీవరెడ్డి, పల్లెర్ల మల్లేష్, కోమటిరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, బుగ్గ మనోజ్ కుమార్, సిలువేరు మహేష్, బుగ్గ మధు, పర్వతం రాజు, జక్కిడి చంద్రారెడ్డి, బందారపు నరేష్, ఈదుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

